

సాక్షి గుంటూరు

శుక్రవారం । 8 । నవంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 9,235 క్యూసెక్కులు వస్తుండగా, 16 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో 41.39 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 6522 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు వదిలారు.

లక్ష్మీనరసింహుని కళ్యాణ వార్షిక వేడుకలు



బెల్లంకొండ: చంద్రాజుపాలెంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి తృతీయ వార్షిక కళ్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడిన ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. గురువారం రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా గుంటూరు బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ ఎంపీ శివాజీతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ మాట్లాడుతూ రాజకీయాల్లోకి వస్తున్న యువతరం రంగా జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.

నివాసాల మధ్య కొండచిలువ



తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పెరికలపూడిలో నివాసాల మధ్య కొండచిలువ తిరుగుతూ ఉండడంతో గురువారం స్థానిక యువకులు దానిని పట్టుకుని చంపివేశారు. గత మూడు రోజుల నుంచి గ్రామ పరిధిలో, నివాసాల మధ్య తిరుగుతూ కోళ్లను తింటూ తప్పించుకు తిరుగుతోంది. ఎట్టకేలకు పంచాయతీ కార్యాలయం వద్ద సంచరిస్తున్న కొండచిలువను యువకులు చంపివేశారు. కొండ చిలువ పొడవు 9 అడుగుల వరకు ఉందని తెలిపారు.

10న బాలబాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ బాలబాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని పోటీల నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఆదివారం గుంటూరులో పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో బాలబాలికలు పోటీపడతారన్నారు. విజేతలకు ట్రోఫీలను అందజేస్తామన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలలతో పాటు ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమయపాలన పాటించి, విధిగా హాజరు కావాలని సూచించారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న సమావేశంలో జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ హాజరవుతున్న దృష్ట్యా హెచ్ఎంలు గత మూడేళ్లలో టెన్త్ పరీక్ష ఫలితాలు, వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పరీక్షల ప్రణాళిక, తదితర అంశాలతో హాజరు కావాలని ఆదేశించారు.

యార్డులో 49,882 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 48,327 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 49,882 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 17,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 27,397 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.



చేతులు తడి'పేక' ఇష్టారాజ్యం

ఆంధ్రాప్యారిస్‌లో జోరుగా పేకాట శిబిరాలు

- రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఆటలు
- రోజుకు కనీసం రూ.3 కోట్ల వరకు చేతులు మారుతున్నట్లు అంచనా
- మామూళ్లు, లంచాల మత్తులో పోలీసులు

తెనాలి: కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో పేకాట శిబిరాలు వెలిశాయి. ఎక్కడంటే అక్కడ అడ్డాలు సిద్ధం చేసుకుని జూదరులు పేకాడుతున్నారు. ఆటగాళ్ల స్థాయిని బట్టి రూ.25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు జూదం నడుస్తోంది. అన్నిచోట్లా కలిసి రోజుకు రూ.3 కోట్లకు పైమాటే చేతులు మారుతోందంటే అతిశయోక్తి కాదు. ఇంత జరుగుతున్నా అటుకేసి చూసే పోలీసు అధికారులు లేరు. సమాచారమిచ్చే వ్యవస్థా కనిపించటం లేదు. ఒక శిబిరంపై దాడికని గుంటూరు నుంచి పోలీసులు వచ్చేసరికి ఆటగాళ్లు పందెంకోళ్లలా రివ్వున ఎగిరిపోయారు. పేకాట శిబిరాలన్నీ కూటమి పార్టీలకు చెందిన ఛోటామోటా నాయకుల కనుసన్నల్లోనే నడుస్తుండడం గమనార్హం. ఫలానా ఎమ్మెల్యే తాలూకు అంటూ బోర్డు పెట్టుకు తిరిగితే మనల్ని ఆపేది.. అడిగేది ఎవరు' అన్నట్టుంది ప్రస్తుత ధోరణి. అందుకే ఆయా పార్టీలకు చెందినవారు, చెప్పుకునేవారు యథేచ్ఛగా పేకాట శిబిరాలను నడుపుతున్నారు.

ఓ బ్యాంకు పక్కవీధిలో..!

అయితానగర్‌లోని ఓ బ్యాంకు పక్క వీధిలో పేకాట శిబిరం నడుస్తోంది. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక హోటల్‌లో రూములు అద్దెకు తీసుకుని పేకాడుతున్నారు. ఇక్కడ రోజుకు కనీసం కోటి రూపాయల ఆట జరుగుతోందని సమాచారం. తెనాలి, గుంటూరు, కొన్ని లంక గ్రామాల నుంచి జూదరులు వచ్చి వాలిపోతున్నారని తెలుస్తోంది. ముందు కోత ముక్కతో మొదలయి, కొంతసేపటి తర్వాత 'రమ్మీ'లోకి వెళ్తున్నట్టు సమాచారం. ఒక్కోసారి రెండు ఆటలూ వేర్వేరుగా నడుస్తున్నట్టు తెలుస్తోంది. గత మూడునెలలుగా ఇక్కడ జూదం కొనసాగుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

- రైల్వేస్టేషను ఎదురుగా టీస్టాల్‌కు వెనుకవైపున గల గదిలోనూ పేకాటకు ఉదయం పదిన్నరకల్లా ఆటగాళ్లు సిద్ధమవుతున్నారట! ఇక్కడ రోజుకు రూ.25 లక్షల వరకు జూదం సాగుతోందట.
- సుల్తానాబాద్ ఆలపాటినగర్‌లోనూ గతంలో మద్యంషాపుకని వేసిన షెడ్లలో తెలుగు తమ్ముడు ఆధ్వర్యంలో పేకాట ఇలాకా నడుస్తోందని సమాచారం. ఇక్కడా ప్రభుత్వ ఆఫీసుకు ఉద్యోగులు వచ్చినట్టు ఠంచనుగా జూదరులు వస్తున్నారు. జోరుగా ఆడేస్తున్నారు.
- చంద్రబాబునాయుడు కాలనీలో క్యాటరింగ్ పనుల్లో ఉండే వ్యక్తి ఇంట్లోనే పేకాట నడుస్తోంది. ఏతావాతా పట్టణంలో 10 నుంచి 15 పేకాట శిబిరాలు నడుస్తున్నాయని విశ్వసనీయ సమాచారం.

పోలీసులు చేతివాటం

పోలీసులు చేతివాటం ప్రదర్శించడం వల్లే ఇష్టారాజ్యంగా పేకాట నడుస్తున్నట్టు సమాచారం. పోలీసులు ఒక్క పేకాట శిబిరాల నుంచే కాదు.. అందిన చోటల్లా చేయి చాపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఓ పోలీసు అధికారి ఆటోడ్రైవర్‌కు ఫోన్ చేసి రూ.ఐదువేలు లంచమిస్తేగానీ నీ ఆటోను వదలనని డిమాండ్ చేసిన ఆడియో పట్టణంలో వైరల్ అయింది. సీసీ కెమెరాల ఏర్పాటు పేరుతో రైల్వేస్టేషన్ ఏరియాలో షాపుల నుంచి రూ.2.20 లక్షలు పోలీసులు వసూలు చేశారని చెబుతున్నారు. రైల్వేస్టేషను దగ్గర్లో మడత మంచాలు అద్దెకిచ్చే లాడ్జీల నుంచి నెలకు రూ.పదివేలు వంతున పోలీసులు మామూళ్లు తీసుకుంటున్నారని తెలుస్తోంది.

ఆ భవనంలో నిత్యం జూదం

తెనాలి అయితానగర్ నుంచి తేలప్రోలు వెళ్లే దారిలో దేశంలోని ఓ నగరంలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన కట్టడం తరహాలో ఉండే భవనంలో నిత్యం పేకాట నడుస్తున్న విషయం అందరికీ తెలుసు. అయినా స్థానిక పోలీసులు అటుకేసి చూడట్లేదు. రెండువారాల క్రితం గుంటూరు నుంచి స్పెషల్ స్క్వాడ్ పోలీసులు 24 మంది మూడు వ్యాన్లలో వచ్చేసరికి ఒక్క ఆటగాడూ లేకపోవటంతో ఉసూరుమన్నారు. అంటే పోలీసులు వస్తున్న విషయం ఉప్పందిందన్న మాటేగా!

లారీల నిర్వహణ భారమే

- పెరిగిన పన్నులతో నడపలేం
- ఆటోనగర్ నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆవేదన
- యూనియన్ నిర్వహణలో ప్రైవేటు వ్యక్తుల జోక్యంపై నిరసన

పెదకాకాని: పెరిగిన టాక్స్‌లతో లారీలు నడపడం భారంగా మారిందని ఆటోనగర్ నార్త్ ఈస్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నక్కల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోనగర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేటు వ్యక్తులు యూనియన్‌ను చిన్నాభిన్నం చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా నక్కల శ్రీనివాసరావు మాట్లాడుతూ 16 ఏళ్లుగా అసోసియేషన్ ద్వారా మిర్చియార్డు పార్టీలతో కలసి బిహార్, బెంగాల్, అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరుకు గమ్యస్థానాలకు చేరుస్తున్నామన్నారు. అన్ని పార్టీలు, మతాలు, కులాల వారితో కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేశామన్నారు. చిల్లీస్ వ్యాపారి ఒకరు తన వ్యక్తిగత అవసరాలు, స్వార్థం కోసం ఇప్పటి వరకూ యూనియన్‌తో కలసి పనిచేసి ఇప్పుడు ఈ అసోసియేషన్ ప్రతిపక్షానిది అని ముద్ర వేసి బురద జల్లుతున్నాడని ఆవేదన చెందారు. అసోసియేషన్‌లో 800 వరకూ లారీలు ఉండగా వాటిలో 300 లారీలకు యజమానులే డ్రైవర్లుగా ఉంటూ తిప్పుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏర్పడిన అసోసియేషన్ ఆ తరువాత టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాలతోపాటు తాజాగా టీడీపీ హయాంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ సరుకులు ఎగుమతి చేస్తోందని స్పష్టం చేశారు. లారీలకు హైట్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌లతోపాటు ఇటీవల కాలంలో టోల్‌గేట్ చార్జీలు, ఎగుమతి, దిగుమతుల ఖర్చులు, డ్రైవర్లు, క్లీనర్‌లు, షెడ్లు ఖర్చులు బాగా పెరిగిపోయాయని ఆవేదన చెందారు. జత టైర్లు 50 వేల రూపాయల వరకూ ధర పలుకుతున్నాయని, లారీలు నడపడం భారంగా ఉందన్నారు. గుంటూరు మిర్చియార్డులో కొందరు దోపిడీ చేస్తున్నారని, లోడింగ్ చేయిస్తే రూ.5,500, రహదారి పత్రాల పేరుతో రూ.2,500, లారీ కిరాయి ఇవ్వడానికి 5 శాతం మామూళ్ళు వసూలు చేస్తున్నారన్నారు. లోడు అయినా ఆటోనగర్ వచ్చి రూ.1500 రూపాయలు ఇచ్చి మోకులు లాగి టైట్ చేయడం తప్పడం లేదని వివరించారు. నిరసన తెలిపిన వారిలో అసోసియేషన్ సభ్యులు సోమిశెట్టి ఏడుకొండలు, షేక్ నాగుల్‌మీరావలి దాసరి ప్రసాదు, పఠాన్ రియాజ్‌ఖాన్, తోటకూర చంద్రబాబు, కంజుల కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.



గుంటూరు ఆటో నగర్‌లో నిరసన తెలియజేస్తున్న లారీల యజమానులు

మిల్లుల్లో మంత్రి మనోహర్ తనిఖీలు

- మంత్రి రాకను చూసి బియ్యం బ్యాగులను దహనం చేసిన ఓ మిల్లు యాజమాన్యం
- చర్యలకు మంత్రి ఆదేశం

మేడికొండూరు : గుంటూరు జిల్లా పేరేచర్ల జంక్షన్‌లో ఉన్న బియ్యం మిల్లులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో లక్ష్మీ గణపతి బియ్యం మిల్లు ప్రాంతంలో బియ్యం పంపిణీ చేసే వాహనం దాచి ఉంచడాన్ని మంత్రి ప్రత్యక్షంగా చూశారు. బియ్యం పంపిణీ చేసే ఎండీయూ వాహనం ఇక్కడ ఎందుకు ఉందని ఆరా తీశారు. మిల్లు యాజమాన్యం పొంతన లేని సమాధానం చెప్పడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి రాకను గమనించిన పేరేచర్ల వెంకటేశ్వర రైస్ మిల్ ప్రాంగణంలో సీఎంఆర్ఎస్ రైస్ బ్యాగులను దహనం చేశారు. దీంతో మంత్రి రైస్ బ్యాగులను దహనం చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని అక్కడ సిబ్బందిని అడిగారు. వారు కనీసం నోరు కూడా మెదకపోవడంతో రైస్ మిల్లు సిబ్బందిని అదుపులోకి తీసుకొని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేయాలని అక్కడ ఉన్న పోలీసులను మంత్రి ఆదేశించారు. లక్ష్మీ గణపతి రైస్ మిల్లు, విఘ్నేశ్వర రైస్ మిల్లులను క్షుణ్ణంగా పరిశీలించారు. టార్చ్ లైట్ల వెలుగులో 26 కేజీల బస్తాల బియ్యం తూకాలను పరిశీలించి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. బియ్యం పంపిణీ విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. మంత్రి వెంట జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, మేడికొండూరు తహసీల్దార్ కళ్యాణి, కలెక్టరేట్ డెప్యూటీ తహసీల్దార్ భాస్కర్ ఉన్నారు.



పేరేచర్ల జంక్షన్‌లోని రైస్ మిల్లులో బియ్యాన్ని తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

13 టన్నుల బియ్యం సీజ్

ప్రత్తిపాడు: మంత్రి నాదెండ్ల మనోహర్ వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని ఓ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఆటోల్లో తరలించేందుకు సిద్ధం చేసిన 13 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైస్ బ్యాగులతో పాటు రెండు ఆటోలను సీజ్ చేసి, డ్రైవర్లపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర మీదుగా విదేశాలకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు స్థానికులు మంత్రికి వివరించారు.

గుండ్లకమ్మ నదిలో యువకుడి గల్లంతు

అద్దంకి రూరల్: స్నేహితులతో కలిసి సరదాగా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. ఈ దుర్ఘటన అద్దంకిలోని గుండ్లకమ్మ నదిలో గురువారం సాయంత్రం జరిగింది. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భట్లపల్లి గ్రామానికి చెందిన తేలుకుట్ల నారాయణ (27) అద్దంకిలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. ఈనేపథ్యంలో తన మిత్రులైన కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంకు చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు, కావూరి ఫిలిప్‌లతో కలిసి గుండ్లకమ్మ నదిలోకి గురువారం సాయంత్రం స్నానానికి వెళ్లాడు. నలుగురూ నదిలో దిగి స్నానం చేస్తుండగా నారాయణ కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా కనిపించలేదు. సీఐ, ఫైర్ ఇంజన్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రపంచ వేదికపైకి 'కోటి' ఆశలతో..

'పంచ్' ప్రాణాలూ పణంగా పెట్టి

- పతకాల వేటే లక్ష్యం
- విజయాల పరంపర
- ఏషియన్ కిక్ బాక్సింగ్‌లో కాంస్యం
- ఇటలీలో జరిగే ప్రపంచ కప్‌కు అర్హత
- రాష్ట్రంలోనే తొలి క్రీడాకారుడిగా గుర్తింపు
- కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న కోటి నాగబాబు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎవరి సాయం లేకుండా అకుంఠిత దీక్షతో కఠోర సాధనతో క్రీడల్లో రాణించే వారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిని వారు సాధించిన విజయాలే ప్రపంచానికి పరిచయం చేస్తాయి. ఇదే కోవకు చెందుతారు కోటి నాగబాబు. ఆయన కిక్ బాక్సింగ్‌లో దూసుకుపోతున్నారు. ఏషియన్ పోటీల్లో సత్తాచాటి ఇటలీలో జరిగే ప్రపంచ్ కప్‌కు అర్హత సాధించారు. అంతర్జాతీయ యవనికపై గుంటూరు కీర్తిని రెపరెపలాడించేందుకు సిద్ధమవుతున్నారు.

సరదాగా ప్రారంభించి..

గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులో ఉంటున్న యాసం కోటి నాగబాబు స్వగ్రామం రేపల్లె దగ్గర్లోని కారుమూరు. తండ్రి శ్రీనివాసరావు. తల్లి లంకా బసవపూర్ణమ్మ వీఆర్ఏ. తండ్రి దూరంగా ఉంటున్నారు. తల్లి సంపాదనే కుటుంబానికి ఆసరా. అయినా నాగబాబు పేదరికాన్ని ఎదిరించి తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. సినిమాల ప్రభావంతో సరదాగా తైక్వాండోలో శిక్షణ తీసుకున్నారు. మూడేళ్ల సాధన తర్వాత కిక్ బాక్సింగ్‌పై అతని దృష్టి మళ్లింది. ఈ సమయంలో ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న కోటిని ఓ పెద్దాయన ఏటుకూరుకు చెందిన సీతారామయ్యకు పరిచయం చేశారు. దీంతో సీతారామయ్య కోటిని సొంత బిడ్డలా చూసుకుంటూ ఆశ్రయం కల్పించారు. వసతులు సమకూర్చారు. దీంతో 15 నెలల నుంచి కోటి కిక్ బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. సీతారామయ్య సూచనతో తులసి సీడ్స్ అధినేత రామచంద్రప్రభు కూడా కోటికి ఆసరాగా నిలిచారు. సహకారం అందిస్తానని మాట ఇచ్చారు.



ప్రపంచకప్ పోటీలకు స్పాన్సర్‌షిప్ చేస్తామని హామీ ఇస్తున్న రామచంద్ర ప్రభు

కఠోర సాధనతో ఇంటర్నేషనల్ బాక్సర్‌గా..

దీంతో కోటి పట్టుదలతో శిక్షణ కొనసాగించారు. కఠోరన సాధన చేశారు. ఫలితంగా గత నెల కాంబోడియాలో జరిగిన ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కేజీల విభాగంలో కాంస్య పతకంతో సహా రెండు పతకాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. ఏపీ నుంచి ఈ పతకాలు సాధించిన తొలి వ్యక్తి కోటి కావడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చిలో ఇటలీలో జరగనున్న వరల్డ్ కప్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్ హోదాను పొందారు.

సాధించిన విజయాలు

- 2023లో విశాఖలో జరిగిన జాతీయ శిక్షణ ట్రైల్స్‌లో కాంస్యం పతకం.
- అదే ఏడాది పంజాబ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ నేషనల్స్‌కు అవకాశం.
- మొత్తం 54 విభాగాల్లో 7,000 మంది పాల్గొన్న సీనియర్ నేషనల్స్ మహాటోర్నీలో 17వ స్థానం.
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో సిమ్లాలోని షిలారు కోచింగ్ క్యాంప్‌కు అర్హత.
- విదేశీ కోచ్‌ల తర్ఫీదులో కొత్త మెళకువలు
- ఈ ఏడాది ఫిబ్రవరిలో డిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు.
- ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు

కిక్ బాక్సింగ్ ప్రాణం

ప్రాణం పణంగా పెట్టి కిక్ బాక్సింగ్‌కు సిద్ధమవుతున్నా. పేద కుటుంబం నుంచి వచ్చా. సీతారామయ్య, రామచంద్రప్రభుల సహకారంతో ముందుకు సాగుతున్నా. వారి రుణం తీర్చుకోలేనిది. ఇంటర్నేషనల్ కోచ్ (ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు) జి.ఆనంద్‌పాల్ శిక్షణలో ఎంతో నేర్చుకుంటున్నాను. జిల్లా తరపున ప్రపంచ కప్ పోటీల్లో దేశానికి పతకం తేవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. ప్రస్తుతం నాకు విదేశీ కోచ్‌ల శిక్షణ చాలా అవసరం. శాప్‌లో ప్రస్తుతం కిక్ బాక్సింగ్ లేదు. దీనిని కూడా ఏర్పాటు చేయాలి. ఏషియన్ మెడల్స్ సాధించడంలో ఎందరో సహకారమందించారు. వారికి ధన్యవాదాలు.

– యాసం కోటి నాగబాబు, ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్



కాంబోడియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో పతకంతో విజయ దరహాసం

రౌడీషీటర్ లడ్డూకు కూటమి అండ!

- టీడీపీ, జనసేన మద్దతుతోనే తెనాలి పట్టణంలోకి ప్రవేశం
- బహిరంగంగా పుట్టినరోజు వేడుకలు
- పాల్గొన్న కూటమి నేతలు, కార్యకర్తలు
- తర్వాత మూడురోజులకే ఇంద్రజిత్ అనే వ్యక్తిపై దాడి
- పట్టణంలోకి రావద్దని గతంలో లడ్డూకు పోలీసుల ఆదేశాలు

తెనాలి: పోలీసుల ఆదేశాలతో గతంలో పట్టణం విడిచి వెళ్లిన రౌడీషీటర్ సముద్రాల పవన్‌కుమార్ అలియాస్ లడ్డూ కూటమి నేతల మద్దతుతో మళ్లీ తెనాలిలోకి ప్రవేశించాడు. గతనెల 25న బహిరంగగానే పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నాడు. ఈ వేడుకల్లో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ తర్వాత మూడు రోజులకే 28న ఇంద్రజిత్ అనే వ్యక్తిపై దాడి చేశాడు. కానీ లడ్డూ మాజీ ఎమ్మెల్యే శివకుమార్ అనుచరుడు అంటూ కూటమి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు.

అసలేం జరిగిందంటే

గత ఎన్నికల సమయంలో అయితానగర్‌లో ఒక ఎన్నారైపై దాడి చేసిన కేసులో నిందితుడైన లడ్డూను నగర బహిష్కరణ చేయాలని పోలీసు అధికారులు నిర్ణయించారు. ఆ నిర్ణయం పెండింగులో ఉందో? లేదో? తెలియదుగాని పోలీసు అధికారులు మాత్రం లడ్డూను తెనాలి రావొద్దని హెచ్చరించారు. అప్పటి నుంచి అతడు ఊరికి దూరంగా ఉంటున్నాడు. ఓటు వేసేందుకూ రాలేదు.

కూటమి సాయంతోనే!

ఇటీవల చడీచప్పుడు లేకుండా తెనాలి వచ్చిన లడ్డూ గత నెల 25న పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నాడు. ఈ వేడుకల్లో తెలుగుదేశం పార్టీ అయితానగర్ ప్రముఖుడు, మంత్రి నాదెండ్లకు సన్నిహితంగా ఉంటున్న కన్నెగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలతోపాటు లడ్డూ లాయర్ కూడా వేడుకల్లో ఉన్నారు. అప్పట్లో ముగిసిన జనసేన పార్టీ సభ్యత్వ నమోదుకూ లడ్డూ సాయపడ్డాడని సమాచారం. తన బంధువర్గం, స్నేహితులు సహా దాదాపు 500 మంది వరకూ జనసేన సభ్యత్వం తీసుకొనేందుకు తోడ్పడ్డాడని చెబుతున్నారు. అందుచేతనే పోలీసుల ఆదేశాల మేరకు పట్టణ బహిష్కరణలో ఉన్నా లడ్డూ అంత ధైర్యంగా పట్టణానికి వచ్చి, పుట్టినరోజు జరుపుకోగలిగాడని చెబుతున్నారు.



లడ్డూతో పుట్టినరోజు కేక్ కట్‌చేయిస్తున్న టీడీపీ నేత కన్నెగంటి మురళీకృష్ణ (ఎడమ చివర)

వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం

ఇదిలా ఉంటే లడ్డూ. గత నెల 28న రాత్రి డెకరేషన్ వర్క్ చేసే నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్‌పై దాడి చేశాడు. అతడి ద్విచక్ర వాహనం లాక్కుని తగులబెట్టాడు. దీంతో కూటమి నేతలు వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి దిగారు. లడ్డూ వైఎస్సార్ సీపీకి చెందినవాడని, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అనుచరుడనీ గగ్గోలు పెట్టారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న ఇంద్రజిత్‌ను పరామర్శించి రౌడీయిజాన్ని సహించేది లేదని చెప్పుకొచ్చారు. తీరా చూస్తే లడ్డూ పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్న ఫొటో బయటకొచ్చింది. ఇప్పుడు దీనిపై ఏం సమాధానం చెబుతారని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు అడ్డుకోకుండా లడ్డూకు కాపుకాస్తోంది కూటమి నేతలేనని విమర్శిస్తున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,800 గరిష్ఠం : రూ. 3,700

మోడల్ ధర రూ. 3,300

క్లుప్తంగా

10న డీఎస్సీ ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష

నెహ్రూనగర్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ఈ నెల 10న ఆన్‌లైన్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉచిత శిక్షణకు 320 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి స్క్రీనింగ్ పరీక్ష తర్వాత క్వాలిఫై అయిన 100 మందికి ఉచిత రెసిడెన్షియల్ డీఎస్సీ కోచింగ్ మూడు నెలల పాటు ఇస్తామన్నారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ లోకి వెళ్లి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లాలో ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజీ చౌడవరం, వీవీఐటీ నంబూరు, చలపతి ఇంజినీరింగ్ కాలేజీ లాం లో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు.

రైతులకు అన్ని సేవలు అందేలా చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు(గుంటూరు): గ్రామాలలో రైతులకు వ్యవసాయ సంబంధిత అన్నిరకాల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కృషీభవన్‌లో గుంటూరు సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏలు, ఏఓలు, ఏఈఓలకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రబీ పంటలకు రైతులకు కావలసిన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉడేలా చూడాలన్నారు. పంటల బీమా గురించి రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. లాం ఫాం శాస్త్రవేత్తలు ఈ శిక్షణ అందించారు. మిరప సమగ్ర యాజమాన్యంపై సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రజని, అపరాల సమగ్ర యాజమాన్యంపై డాక్టర్ గంగాదేవి వివరించారు. ఉద్యాన శాఖ పథకాల గురించి ఆ శాఖ జిల్లా అధికారి రవీంద్ర బాబు అవగాహన కల్పించారు. ప్రకృతి సాగుపై జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి వివరించారు. బీజామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జి ఐ.సునీత, గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో'

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని



సాహో పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెమ్మసాని. పక్కన కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో' ప్రత్యేక ప్రణాళిక ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు సమీకరిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో వైద్య సౌకర్యాలు మెరుగు పరిచేందుకు జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో 60 అంశాలపై చర్చించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. బొంగరాలబీడు ఈఎస్‌ఐ హాస్పిటల్ స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నందున ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు రూ. 5 కోట్లు విరాళం ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత అంచనాల ప్రకారం నిర్మాణ ఖర్చులు పెరిగిన దృష్ట్యా తన స్నేహితుడు రూ. కోటి విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా బస్సు ఏర్పాటు చేస్తామని, జన ఔషధి మెడికల్ షాపులు ఆసుపత్రిలో పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తులసి రామచంద్రప్రభు నర్సింగ్ విద్యార్థుల కోసం రూ. 50 లక్షలతో బస్సు కొనుగోలుకు ముందుకు వచ్చారని వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు రూ. 6 లక్షల విలువైన పరికరాలను అందజేసినట్లు వెల్లడించారు. కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 12 సంవత్సరాల లక్ష్మణ ఆదిత్యకు ఇటీవల కాలేయ మార్పిడి జరిగిందని మంత్రి తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఆర్థిక సమస్యలు రావడంతో బాధితులు తమను సంప్రదించగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 7 లక్షలు సహాయం అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి



శిశువు తల్లితో మాట్లాడుతున్న లీలావతి

గుంటూరు మెడికల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి గురువారం గుంటూరు జీజీహెచ్ నవ జాత శిశు రక్షణ వార్డును సందర్శించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రపంచ శిశు రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవల గురించి శిశువుల తల్లులు, వైద్యులతో మాట్లాడి ఆమె తెలుసుకున్నారు. నవజాత శిశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పుట్టినప్పటి నుంచి శిశువులకు ఇవ్వాల్సిన టీకాలు, తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం ఏవిధంగా అందించాలనే విషయాలను వివరించారు. కాలుష్య రహిత గాలి శిశువులకు అందేలా చూడాలన్నారు. పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్న వెంటనే ఆసుపత్రిలో సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాస్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, ప్రొఫెసర్ డాక్టర్ ఝాన్సీవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శివరంజని, డాక్టర్ స్వరూప్‌రాణి పాల్గొన్నారు.

వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న తయారీ కేంద్రం

తెనాలి రూరల్: వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. మండలంలోని సోమసుందరపాలెం ఆటోనగర్‌లో కోస్టల్ కెమికల్ ఇండస్ట్రీస్ పేరిట కలపకు వేసే వార్నిష్ తయారీ కేంద్రం నడుస్తోంది.

బుధవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నిర్వాహకుడు మహమ్మద్ రియాజ్ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకుడు తెలిపారు.

హిందీ పరీక్షలో తెనాలి విద్యార్థిని ప్రతిభ



తెనాలి: హిందీ ప్రేమీమండలి మహా విద్యాలయం 9వ తరగతి విద్యార్థిని రాసంసెట్టి పూజిత గోవర్ధన భవాని (14) దక్షిణ భారత హిందీ ప్రచార సభ(ఆంధ్ర) నిర్వహించిన మధ్యమ పరీక్షలో ప్రథమ ర్యాంకు సాధించింది. హిందీ ప్రచారసభ కార్యదర్శి జానకి ఈ మేరకు సమాచారం పంపారు. బాలికను మండలి అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

18లోపు టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110 చొప్పున ఫీజును ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

విద్యార్థుల అంతర్జాతీయ పర్యటనపై ఐఎస్సీ ప్రత్యేక శ్రద్ధ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున వర్సిటీ విద్యార్థుల విదేశీ పర్యటనపై ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ (ఐఎస్సీ) ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని ఏఎన్‌యూకి చేరుకున్న ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు షేక్ సమీర్, టి వసంత బాబులకు వీసీ ఆచార్య కె. గంగాధరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మావతి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు జపాన్‌లో గత నెలలో జరిగిన సకురా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం-2024లో పాల్గొన్నారని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యాచురల్ మెడిసిన్‌లో వివిధ ఔషధాల పనితీరును విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్ఎస్ఎస్ఎన్ రవికుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ర్యాలీ ఏర్పాటు చేశారు. దీనిని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ 3.0 కార్యక్రమం ఈ నెల 14న ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎం, ఆశ, సీహెచ్ఓలు ప్రతి మంగళ, గురు, శుక్రవారాలలో ఇళ్లను సందర్శించాలన్నారు. వారానికి 45 గృహాలను సందర్శించి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. 30 సంవత్సరాలు దాటిన వారందరికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యులు పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. క్యాన్సర్ అనుమానిత కేసులను ప్రతి మంగళ, శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు తీసుకెళ్లాలన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండి, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే పూర్తిగా నివారించవచ్చునని చెప్పారు. అవగాహన ర్యాలీ డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు సాగింది. గుంటూరు మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సీతారామ, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డాక్టర్ గిరిధర్, డెమో జయప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నుంచి గంజాయి స్వాధీనం



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీఐ వీరేంద్రబాబు

లక్ష్మీపురం: గంజాయిని పొట్లాలుగా మార్చి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు అదుపులో తీసుకుని గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్న పేట 1వ లైన్‌లో అమిత్ బాయ్స్ హాస్టల్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఇచ్చిన సమాచారం ప్రకారం పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. చలపతి కళాశాలలో బీకాం కంప్యూటర్స్ తృతీయ సంవత్సరం విద్యార్థి అయిన వినుకొండ మండలం పిచికల పాలెం గ్రామానికి చెందిన వై. అనిల్ వద్ద గంజాయి ప్యాకెట్లు దొరికాయి. చలపతి కళాశాలలో ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అయిన కొరిటెపాడు నాలుగో లైన్‌కి చెందిన మన్నె తుల సీరాం అనే యువకుడు ఈ గంజాయి తెచ్చి ఇచ్చినట్లుగా అనిల్ అంగీకరించాడు. శ్రీనివాసరావుపేటకు చెందిన అల్తాఫ్ అనే వ్యక్తి నుంచి వీరికి గంజాయి వచ్చినట్లు విచారణలో తేలింది. అల్తాఫ్‌ను కూడా అదుపులో తీసుకున్నారు. ఏటుకూరు రోడ్డులో ఒక వ్యక్తి గంజాయి హోల్‌సేల్‌గా ఇస్తాడని అతడు విచారణలో చెప్పాడు. ముగ్గురిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

పెదకాకాని: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన కొప్పురావూరు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు బొర్రా సుజాత వద్దకు గురువారం ఉదయం 10.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోస్టుమెన్‌గా పనిచేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. తన భార్య సమీపంలోని విశ్వశాంతి స్కూల్‌లో టీచర్ అని చెప్పాడు. రోజూ గుంటూరు నుంచి ఇంటికి రావడానికి ఇబ్బందిగా ఉంటుందని.. ఇల్లు అద్దెకు కావాలన్నారు. ఇల్లు చూసుకుంటున్నామని నమ్మించాడు. ఆ వృద్ధురాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా మూడు ఇళ్లు చూసి... సాయంత్రం తన భార్యను తీసుకుని వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం 3 గంటల సమయంలో తిరిగి కొప్పురావూరు చేరుకుని తన భార్య ఈ రోజు రాలేనని చెప్పిందని పేర్కొన్నాడు. రేపు వస్తామని చెప్పి వెళ్లడానికి వచ్చానని వృద్ధురాలిని నమ్మించాడు. తాగడానికి నీళ్ళు ఇమ్మని చెప్పడంతో లోపలికి వెళ్లింది. వెంట ఆతడు కూడా వెళ్ళి మెడలో బంగారు చైన్ లాక్కుని క్షణాల్లో మాయమయ్యాడు. వృద్ధురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కొప్పురావూరు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

- యువతలో అవగాహన పెరగాలి
- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



మాట్లాడుతున్న రాకేష్ భరద్వాజ్

మంగళగిరి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం సెల్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా కంపెనీతో కలిసి ఈ వేస్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో వీడియో సందేశాన్ని కలెక్టర్ పంపారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమస్యను పరిష్కరించడంలో ముందుకు రావాలన్నారు. ఒప్పో ఇండియా కంపెనీ ప్రజావ్యవహారాల విభాగాధిపతి రాకేష్ భరద్వాజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సెల్‌ఫోన్ల తయారీలో రెండవ స్థానంలో ఉన్నా భారత్‌లో ఈ వేస్ట్ సైక్లింగ్‌లో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 50 మిలియన్ల టన్నులు ఈ వేస్ట్ పేరుకుపోతోందని, దీనిని ఎప్పటికపుడు తగ్గించకపోతే పర్యావరణానికి ప్రమాదం తప్పదన్నారు. ఇన్‌చార్జి వీసీ భరద్వాజ్ శివకుమారన్, డీన్ డాక్టర్ సీవీ టామి, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రంగభాష్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డెబ్లినా దత్తా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

పీఆర్, గ్రామీణాభివృద్ధి శిక్షణ పర్యవేక్షకులు కేశవరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ సమగ్రాభివృద్ధికి దోహదం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖల శిక్షణ పర్యవేక్షకుడు ఆర్.కేశవరెడ్డి పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేశవరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 2025-26 వార్షిక ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక అవసరాలైన సామాజిక న్యాయం, సంక్షేమాలను దృష్టిలో ఉంచుకుని అన్ని మార్గాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. దీనికోసం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. డ్వామా పీడీ వి.శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి గ్రామంలో రూ.రెండు కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు పనులు చేపట్టేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజా ప్రణాళికపై రీసోర్స్ పర్సన్ కె.లలిత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, బడ్జెట్ రూపకల్పనలు, సక్రమ వినియోగం, గ్రామాభివృద్ధికి ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈసందర్భంగా ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్, పీడీఐ పోర్టల్, గ్రామ పంచాయతీ నిర్ణయ్ యాప్ వంటి సాంకేతిక అంశాలపై డీపీఎం రవీంద్రబాబు వివరించారు. ఈవో పీఆర్డీ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆర్థిక వనరుల సక్రమ వినియోగం, ఆదాయ వనరుల సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి జిల్లా స్థాయి అధికారులతో పాటు ప్రతి మండలం నుంచి ఎంపీడీవో, ఈవో పీఆర్డీ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ పాల్గొన్న శిక్షణ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు వి.శ్రీనివాసరావు, కరీముద్దీన్, మేడికొండూరు ఎంపీడీవో తోట చందన, జిల్లా సమన్వయకర్త ఎస్. పద్మారాణి, డీటీఎం కంచర్ల నాగేశ్వరరావు, ఎస్ఐఆర్‌డీ కన్సల్టెంట్ డాక్టర్ కె. మోహనరావు, జీకే జియా పాల్గొన్నారు.

రెండవ రోజు విజృంభించిన ఆంధ్ర క్రికెట్ జట్టు

- సెంచరీతో నాటౌట్‌గా నిలిచిన ఏఎన్‌వీ లోహిత్
- 615 పరుగుల భారీ స్కోర్ సాధించిన ఆంధ్ర జట్టు



సెంచరీ చేసిన ఏఎన్‌వీ లోహిత్



5 వికెట్లు తీసిన ఆర్ నౌనిలాల్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కూచ్ బెహరా ట్రోఫీ అండర్ -19 మ్యాచ్‌లో రెండవ రోజు ఆంధ్ర బ్యాటర్ల విజృంభణతో జట్టు 615 పరుగుల భారీ స్కోర్ సాధించింది. 315 పరుగుల తొలి రోజు స్కోర్‌తో రెండవ రోజు గురువారం ఆట ప్రారంభించిన జట్టు 65 ఓవర్లలో 300 పరుగులు చేసింది. మొత్తం 155 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 615 పరుగులు సాధించింది. రెండవ రోజు జట్టు బ్యాట్స్‌మెన్ ఏవీఎన్ లోహిత్ 121 బంతులలో 3 సిక్స్‌లు, 7 ఫోర్లతో 100 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. కె.రేవంత్ 163 బంతులలో 3 సిక్స్‌లు రెండు ఫోర్లతో 72 పరుగులు, టి వరుణ్ సాత్విక్ 135 బంతులలో 8 ఫోర్లతో 68 పరుగులతో రాణించారు. హిమాచల్ ప్రదేశ్ బౌలర్ ఆర్ నౌనిలాల్ 5 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హిమాచల్ ప్రదేశ్ జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 50 పరుగులు చేసింది.

సమస్యలు పరిష్కరించలేని గ్రామ సభలెందుకు?

వరగానిలో అధికారులకు రైతుల సూటి ప్రశ్న



గ్రామ సభ రద్దుకు డిమాండ్ చేస్తున్న వరగాని రైతు

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలపై రైతులు పెదవి విరుస్తున్నారు. సమస్యలు పరిష్కారం కానప్పుడు ఈ సభల నిర్వహణ ఎందుకని గళం విప్పుతున్నారు. పెదనందిపాడు మండలం వరగానిలో గురువారం రెవెన్యూ అధికారులు సర్వే సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు గ్రామసభ నిర్వహించారు. హాజరైన రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఒక రైతు తన పొలం సర్వేకు ముందు ఆన్‌లైన్‌లో నమోదయ్యిందని, సర్వే చేసిన తరువాత ఆన్‌లైన్‌లో పేరు నమోదు కాలేదని అధికారుల వద్దకు వెళ్లి తన సమస్యను విన్నవించారు. పరిష్కారం కోసం కార్యాలయానికి రావాలని సభకు హాజరైన అధికారులు సూచించారు. దీంతో ఆగ్రహించిన రైతు సమస్యలు పరిష్కారం కానప్పుడు గ్రామసభలు నిర్వహించడం ఎందుకని, సభను రద్దు చేయాలని మండిపడ్డాడు. దీంతో పక్కనే ఉన్న గ్రామస్తులు, రైతులు ఆ రైతును శాంతింపజేశారు. ఇదిలా ఉంటే సమస్య ఉంటే అర్జీలు ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారని, అర్జీలు రాయడం కొందరు రైతులకు రాదని, అలాంటి వారికి అర్జీలు రాసేందుకు కూడా స్థానికంగా సిబ్బంది అందుబాటులో లేరని రైతులు వాపోయారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, పక్కన ఎస్ఐ ప్రకాశరావు

రూ. 7.50 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

తెనాలి రూరల్: డిగ్రీ చదివిన యువకుడు కారు డ్రైవరుగా పని చేస్తూ చెడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. తెనాలి బాలాజీరావుపేటలో వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ వివరాలను సీఐ ఎస్. రమేష్ బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం... విజయవాడ కొత్తపేటలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌కు చెందిన గుదే హరీష్‌కుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తున్నాడు. గతంలో విజయవాడ, ఏలూరులో చోరీలకు పాల్పడి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ క్రమంలో తెనాలి బాలాజీరావుపేట కిరాయి కోసం వచ్చినప్పుడు అతడు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తున్నాడు. బాలాజీరావుపేటలోనే ఏడాది వ్యవధిలో ఐదు దొంగతనాలకు పాల్పడ్డాడు. తాళం వేసి ఉన్న ఇంటి వెనుక తలుపును పగులగొట్టి లోనికి ప్రవేశించాక బీరువా, కబోర్డుల తాళం చెవులు వెతికేవాడు. దొరికితే వాటితో ఓపెన్ చేసి.. ఆభరణాలను తస్కరించేవాడు. విజయవాడలో తెలిసిన వ్యక్తి ద్వారా ఆభరణాలను గవర్నర్ పేటలో బంగారం నాణ్యత పరీక్షించే షాపులకు విక్రయించాడు. ఆ డబ్బుతో గోవాలో జల్సాలు చేసేవాడు. తిరిగి వచ్చాక డబ్బులు అవసరమైనప్పుడల్లా రైలులో తెనాలి రావడం స్టేషన్‌కు వచ్చేవాడు. సమీపంలోని బాలాజీరావుపేటలో చోరీ చేసి, తిరిగి రైలెక్కి విజయవాడ వెళ్లిపోతున్నాడు. ప్రత్యేక బృందం విజయవాడ వెళ్లి నిందితుడి కదలికలపై నిఘా ఉంచింది. చివరకు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తే.. వరుస చోరీల వ్యవహారం బయటపడింది. అతడి నుంచి సుమారు రూ. 7.10 లక్షల విలువైన బంగారు నగలు, రూ. 40 వేల విలువ చేసే వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో మరికొందరిని అరెస్టు చేసి, మరింత బంగారం స్వాధీనం చేసుకోవాల్సి ఉందని సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ ఎ. ప్రకాశరావు, ఏఎస్ఐ ఎస్‌కే హైదర్ అలీ, కానిస్టేబుళ్లు పి.మురళి, ఎస్. జైకర్ బాబులను అభినందించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు బీరువా, ఇతర కబోర్డుల తాళం చెవులు ఇంట్లో ఉంచవద్దని సూచించారు. లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్ఎంఎస్) తెనాలి పోలీసుల వద్ద అందుబాటులో ఉందని, దానిని వినియోగించుకోవాలని సీఐ సూచించారు.